# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం యువత కీలక పాత్ర పోషించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.
- రక్షణ తయారీలో స్వావలంబన దిశగా దేశం వేగవంతమైన పురోగతిని సాధిస్తోందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు.
- దేశ భవిష్యత్‌ని నిర్దేశించే బాధ్యతాయుతమైన పాత్ర విద్యార్థులదని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.
- భారత 31వ సైన్యాధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ న్యూఢిల్లీలో ఈరోజు పదవీ బాధ్యతలను స్వీకరించారు.

=========================

వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం యువత కీలక పాత్ర పోషించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఈరోజు నిర్వహించిన కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం మొదటి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ... విద్యావంతులైన యువత ద్వారానే దేశ నిర్మాణం సాధ్యపడుతుందన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో సమాజంలో వెనుకబడి ఉన్న అట్టడుగు వర్గాలను మరవకూడదని హితవు పలికారు. సమాజంలో ఎందరో పేదలు, అట్టడుగు వర్గాల వారు ఉన్నారని, వారిని ముందుకు తీసుకుని రావడంలో యువత సహకారం అవసరమని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

=========================

రహదారి భద్రత విషయంలో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు. రహదారి భద్రతపై న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... సరైన సూచికలు, లేన్ గుర్తులు, అండర్ పాస్‌లతో సహా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన రహదారి వ్యవస్థ రూపకల్పన కోసం ప్రభుత్వ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని, అతివేగాన్ని నివారించాలని, హెల్మెట్లు, సీట్ బెల్టులు ధరించాలని కేంద్రమంత్రి కోరారు. అదే విధంగా లేన్ క్రమశిక్షణను పాటించాలని, వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్లు వాడకుండా ఉండాలని నితిన్ గడ్కరీ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ ఉత్పత్తుల తయారీలో స్వావలంబన దిశగా దేశం వేగవంతమైన పురోగతిని సాధిస్తోందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. 2014లో సుమారు 46 వేల కోట్ల రూపాయలుగా ఉన్న దేశీయ రక్షణ ఉత్పత్తి ప్రస్తుతం 1.78 లక్షల కోట్ల రూపాయలకు పెరిగిందన్నారు. వడోదరలో ఈరోజు నిర్వహించిన వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. దృఢమైన ఆర్థిక వ్యవస్థ బలమైన రక్షణ సామర్థ్యాలకు పునాది అని స్పష్టం చేశారు. గుజరాత్ త్వరలో రక్షణ తయారీకి గ్లోబల్ హబ్‌గా అవతరించనుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. అదే విధంగా వడోదర ఇప్పుడు భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్-రంగం సైనిక విమానాల తయారీ కేంద్రానికి నిలయంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ గుర్తు చేస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గ్రీస్ నుండి భారతదేశానికి యూపీఐ ఆధారిత నగదు చెల్లింపు సేవలను యూరో బ్యాంక్ ఈ రోజు ప్రారంభించింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్‌తో బ్యాంక్ సహకారంలో యూరో బ్యాంక్ ఈ సేవలను అందిస్తోంది. దేశ సరిహద్దులు దాటి డబ్బు బదిలీ చేయడానికి యూరో బ్యాంక్ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయి. భారతదేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించే క్రమంలో ఇది ముఖ్యమైన మైలురాయి అని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సామాజిక మాధ్యమం పోస్ట్‌లో పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ భవిష్యత్‌ని నిర్దేశించే బాధ్యతాయుతమైన పాత్ర విద్యార్థులదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. విశాఖలో జరిగిన కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం తొలి స్నాతకోత్సవంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విశ్వవిద్యాలయం నుంచి అభ్యసించిన విద్యను వర్తమాన సమాజ అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు దేశంలో చారిత్రక గుర్తింపు ఉందని కేంద్రమంత్రి గుర్తు చేశారు. తీర ప్రాంతం నుంచి నాగరికత వివిధ దేశాలకు విస్తరించిందని చెప్పారు. విశాఖ ప్రాంతం నుంచి వచ్చిన అల్లూరి సీతారామరాజు బ్రిటీషర్లతో పోరాడారని ఆయన తెలిపారు. విద్యార్థులు 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని ఆవిష్కరించే క్రమంలో తమ వంతు పాత్ర పోషించాలని కేంద్ర మంత్రి కోరుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత 31వ సైన్యాధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో పదవీ బాధ్యతలను స్వీకరించారు. సాయుధ దళాలలో 40 ఏళ్లకు పైగా సేవలందించి ఇవాళ పదవీ విరమణ చేసిన జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఖడక్వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన జనరల్ ధీరజ్ సేథ్.. 1986 డిసెంబర్ లో ఆర్మర్డ్ కోర్ లో చేరారు. 31వ సైన్యాధిపతి కావటానికి ముందు ఉప సైన్యాధిపతిగా సేవలందించారు. ఇదిలా ఉండగా పదవీ విరమణ చేసిన ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ... జాతీయ భద్రతకు సంబంధించిన అన్ని విషయాలలో భారత సైన్యం స్పష్టమైన లక్ష్యాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత స్ఫూర్తితో తన విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వస్తోందని పేర్కొన్నారు. సైన్యం, నౌకాదళం, వైమానిక దళం మధ్య సమన్వయం ఒక ఉమ్మడి అవగాహన, పరస్పర విశ్వాసం ఉన్నాయని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అక్రమ వలసలు, మానవ అక్రమ రవాణాను ఎదుర్కోవడం అన్ని దేశాల సమిష్టి బాధ్యత అని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన హ్యూమన్ రిసోర్స్ మొబిలిటీ ఫోరమ్‌లో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... భారతదేశం 26కు పైగా దేశాలతో 28 మొబిలిటీ భాగస్వామ్య ఒప్పందాలపై సంతకాలు చేసిందని తెలిపారు. మరికొన్ని చర్చల దశలో ఉన్నాయన్నారు. సురక్షితమైన, క్రమబద్ధమైన, చట్టబద్ధమైన వలసలను నిర్ధారించడంలో ద్వైపాక్షిక సహకారం అవసరాన్ని కూడా భారతదేశం గుర్తిస్తుందని జైశంకర్ చెప్పారు. ఆలోచనలను పంచుకోవడానికి, అనుభవాల నుండి నేర్చుకోవడానికి, మొబిలిటీకి సంబంధించి కొత్త విధానాలను అన్వేషించడానికి ఈ ఫోరమ్ అవకాశాలను అందిస్తుందన్నారు. విశ్వసనీయమైన రవాణా మార్గాలు బలమైన ఆర్థిక వ్యవస్థలకు, మరింత పటిష్టమైన సమాజాలకు, లోతైన అంతర్జాతీయ సహకారానికి దోహదపడతాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పెట్రోల్, డీజిల్ అమ్మకాలు, పంపిణీని నియంత్రించే తాత్కాలిక నిబంధనలను రేపటి నుంచి ఎత్తివేస్తున్నట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పశ్చిమాసియా సంక్షోభం వల్ల తలెత్తిన పరిణామాల నేపథ్యంలో దేశంలో పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను స్థిరంగా ఉంచడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ నెల 12వ తేదీన తాత్కాలిక నిబంధనలను ప్రవేశపెట్టినట్లు ఆ శాఖ వెల్లడించింది. ఈ నిబంధనల ప్రకారం రిటైల్ అవుట్ లెట్లలో ప్రతి వినియోగదారుడు లేదా వాహనానికి రోజుకు 200 లీటర్ల హై స్పీడ్ డీజిల్‌పై తాత్కాలిక పరిమితిని విధించారు. దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా పరిస్థితిని సమీక్షించిన అనంతరం.. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తాత్కాలిక నియంత్రణ చర్యలు ఇకపై అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం నిర్ధారించిందని మంత్రిత్వ శాఖ వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =